


పియుసి చైర్మన్‌గా 'కూన'

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వరంగ సంస్థల కమిటీ చైర్మన్‌గా ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ నియమితులయ్యారు. ఈమేరకు శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఉత్తర్వులు జారీ చేశారు. శాసన వ్యవస్థలో ఫైనాన్షియల్ కమిటీలో ప్రభుత్వరంగ సంస్థల కమిటీ ఒకటి. పియుసి చైర్మన్‌గా రవికుమార్‌ను నియమించడంపై ఆ పార్టీ శ్రేణులు, ఆయన అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





దర్శనానికి క్యూలైన్‌లో బారులు తీరిన యాత్రికులు

ఆదిత్యుని జయంత్యుత్సవం

వైభవోపేతం

- అరసవల్లికి పోటెత్తిన సందర్శకులు
- సిఫార్సులున్న వారికే శీఘ్ర దర్శనం
- సామాన్య సందర్శకులు గంటల తరబడి నిరీక్షణ
- రూ.500, రూ.300 టికెట్లు ఉన్న వారిదీ అదే పరిస్థితి
- క్యూలైన్‌లో సొమ్మసిల్లిపోయిన ఇద్దరు యాత్రికులు

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు మంగళవారం వైభవోపేతంగా నిర్వహించారు. సోమవారం అర్ధరాత్రి 12.30 గంటలకు ప్రారంభమైన క్షీరాభిషేక సేవ మంగళవారం ఉదయం ఏడు గంటల వరకు సాగింది. రథసప్తమి వేడుకలను వీక్షించేందుకు అర్ధరాత్రి నుంచే రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు తెలంగాణ, ఒడిశా నుంచి వేల సంఖ్యలో యాత్రికులు చేరుకున్నారు. ప్రభుత్వం రాష్ట్ర పండగగా ప్రకటించడం... ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు విస్తృత ప్రచారం చేయడంతో అరసవల్లికి జనం పోటెత్తారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

రథసప్తమి వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేశామని అధికారులు చెప్పినా, సాధారణ సందర్శకులకు అవే కష్టాలు పునరావృతమయ్యాయి. వాడాడ, ఖాజీపేట కూడలి నుంచి వచ్చిన సందర్శకులు ఉచిత క్యూలైన్లు, రూ.100 టికెట్ల క్యూలైన్లల్లో బారులు తీరారు. ఉదయం పది గంటల వరకు దర్శనాలు సాఫీగానే సాగాయి. వివిఐపిల తాకిడి పెరిగిన తర్వాత గంటల తరబడి క్యూలైన్‌లో నిల్చోవాల్సి వచ్చింది. 80 అడుగుల రోడ్డు నుంచి ఉచిత క్యూలైన్ల వద్దకు చేరుకోవడానికి నానా అవస్థలు పడ్డారు. మిల్లు కూడలి నుంచి ఆర్చి వరకూ నాలుగు చోట్ల పోలీసులు రోప్‌లతో సందర్శకులను కట్టడి చేశారు. ఉచిత దర్శనం కోసం వెళ్లే వారికి టికెట్లు లేకపోవడంతో వారిని ఆపేశారు. దీంతో ఎటువైపు వెళ్లాలో తెలియక యాత్రికులు అయోమయానికి గురయ్యారు. రూ.వంద టికెట్ తీసుకుని దర్శనానికి వెళ్లేందుకూ ఇబ్బందులు తప్పలేదు. క్యూలైన్‌లోకి వెళ్లిన తర్వాత మాత్రం వారికి శీఘ్ర దర్శనమైంది. రూ.500, రూ.300 టికెట్లు కొనుగోలు చేసిన వారు గంటల తరబడి క్యూలైన్‌లో నిల్చోవాల్సి వచ్చింది. వివిఐపి క్యూలైన్‌లో ఎప్పటిమాదిరిగానే పోలీసులు, పలు ప్రభుత్వ శాఖలకు చెందిన సిబ్బంది తమ కుటుంబసభ్యులను దగ్గర ఉండి దర్శనాలు చేయించారు. సిఫార్సులతో వచ్చిన వారు తమ కళ్లెదుటే లోపలకు వెళ్లి కొద్ది నిమిషాల్లోనే తిరిగి వచ్చేస్తున్నా, రూ.500 టికెట్లు తీసుకున్న వారు ఇంకా అక్కడే ఉండిపోవడంతో వారు తీవ్ర అసహనానికి లోనయ్యారు. మరోవైపు దాతలను, రూ.500 టికెట్ తీసుకున్న సందర్శకులను ఒకే లైన్‌లో పంపించడంతో గంటల తరబడి క్యూలైన్‌లో నిరీక్షించాల్సి వచ్చింది.



సందర్శకులను నెట్టేస్తున్న పోలీసులు

సిఫార్సులున్న వారికే శీఘ్ర దర్శనం

రథసప్తమి వేడుకల్లో ఈసారీ సిఫార్సులు ఉన్న వారికి అధికారులు, పోలీసులు రెడ్ కార్పెట్ వేశారు. అధికారులు లెక్కకు మించి వివిఐపి పాసులు, వాహనాల పాసులు జారీ చేయడంతో ప్రజాప్రతినిధుల బంధువులు, వారి అనుయాయులకు అడ్డే లేకుండా పోయింది. ప్రోటోకాల్ వాహనాలు, పాసు కలిగిన వాహనాలు విపరీతంగా తిరిగాయి. వారికి నేరుగా ఆలయం ఆర్చి వరకు అనుమతించారు. దర్శనాల కోసం పోలీసు వాహనాలు, ద్విచక్ర వాహనాలకు డ్యూటీలో ఉన్న పోలీసులు అడ్డు చెప్పలేదు.

సందర్శకునిపై చేయి చేసుకున్న ఎస్ఐ

ట్రాఫిక్ రద్దీ నియంత్రణ పేరుతో నాలుగు చోట్ల రోప్‌లతో సామాన్య సందర్శకులను కట్టడి చేశారు. ఈ క్రమంలో చాలా చోట్ల పోలీసులకు, యాత్రికులకు వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో అరసవల్లి తోట వద్ద శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్ఐ హరికృష్ణ పలువురు సందర్శకులను నెట్టేస్తూ ఓ వ్యక్తిపై చేయి చేసుకున్నారు.

క్యూలైన్‌లో సొమ్మసిల్లిన ఇద్దరు యాత్రికులు

ఆదిత్యుని దర్శనం కోసం క్యూలైన్‌లో నిల్చొన్న ఇద్దరు యాత్రికులు సొమ్మసిల్లిపోయారు. పోలీసులు వారికి నీళ్లు అందించారు. అందులో ఒకరికి వైద్య శిబిరం దగ్గరకు తీసుకువెళ్లారు.

బందోబస్తు సరళిని పరిశీలించిన డిఐజి

రథసప్తమి వేడుకలకు బందోబస్తులో ఉన్న పోలీసుల విధులను డిఐజి గోపీనాథ్ జట్టి పరిశీలించారు. పోలీసులకు పలు సూచనలు చేశారు. ఉచిత దర్శనానికి వచ్చే సందర్శకులకు ఇబ్బందుల్లేకుండా వేగంగా దర్శనమయ్యేలా చూడాలని చెప్పారు. సందర్శకుల రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అరసవల్లి ఆర్చి సమీపంలో ఏర్పాటు చేసిన పోలీసు కంట్రోల్‌రూమ్‌ను సందర్శించి సిసి కెమెరాలు, డ్రోన్ కెమెరాల ద్వారా వాహనాల రాక, సందర్శకుల దర్శనం, పార్కింగ్, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ వంటి వివరాలను ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ద్వారా తెలుసుకున్నారు.

క్యూలైన్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్‌పి

రూ.500, రూ.300 క్యూలైన్లను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి మహేశ్వరరెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ స్వయంగా పరిశీలించి సందర్శకులతో మాట్లాడారు. పోలీసు కంట్రోల్‌రూమ్‌ను సందర్శించి సిసి కెమరాలు, డ్రోన్ కెమెరా చిత్రాల ద్వారా సందర్శకుల తాకిడి, ట్రాఫిక్ సమస్యలను పరిశీలించారు. దర్శనం అనంతరం బయటకు వచ్చే యాత్రికులతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడి దర్శనం ఎలా అయిందని అడిగి తెలుసుకున్నారు. యాత్రికుల తాకిడిని గుర్తించి జెసి, ఆర్‌డిఒలకు ఆదేశాలు జారీ చేశారు.



ఆలయం ఆర్చ్ వద్ద జనంలో చిక్కుకున్న జడ్జి కుటుంబం

ఆదిత్యుని దర్శించుకున్న ప్రముఖులు

ఆదిత్యుని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, డిఐజి గోపీనాథ్ జట్టి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా, ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారు కృష్ణభాస్కర్, ఎమ్మెల్యేలు గొండు శంకర్, కూన రవికుమార్, గౌతు శిరీష, ఎన్.ఈశ్వరరావు, మామిడి గోవిందరావు, బగ్గు రమణమూర్తి, ఎమ్మెల్సీలు నర్తు రామారావు, పాలవలస విక్రాంత్, పలువురు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, పలువురు అధికారులు ఉన్నారు.



కంట్రోల్‌రూమ్ సిసి, డ్రోన్ కెమెరాల చిత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి



జి.సిగడాం : బాతువలో కొనుగోలు లేక కళ్లంలోనే ధాన్యం బస్తాలు

ధాన్యం కొనుగోలు నిలిపివేత

- 20 రోజులుగా పొలాల్లోనే ధాన్యం
- తక్కువ ధరకే దళారులకు అమ్ముకుంటున్న వైనం

జి.సిగడాం మండలం బాతువకు చెందిన అసిరప్పడు రెండు ఎకరాల్లో వరి వేశాడు. 50 బస్తాల (80 కేజీలు చొప్పన) దిగుబడి వచ్చింది. చుట్టూ ఉన్న పొలాల్లో మినప, పెసర పంట సాగవుతుండడంతో ధాన్యం ఇళ్లకు తీసుకురావడానికి ఆలస్యమైంది. ధాన్యాన్ని సమీపంలోని బాతువ రైతు సేవా కేంద్రానికి తీసుకువెళ్లాడు. కొనుగోలుకు సంబంధించి ట్రక్‌షీట్‌లు జనరేట్ కాలేదంటూ సిబ్బంది తిప్పి పంపడంతో అదే ట్రాక్టర్‌తో ఇంటికి చేరుకున్నాడు. 15 రోజులుగా కొనుగోలు కేంద్రాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం కనిపించకపోవడంతో దళారులను ఆశ్రయించాడు. క్వింటాకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం 80 కేజీల బస్తాకు రూ.1840 దక్కాల్సి ఉండగా, రూ.1650 మాత్రమే చేతిలో పెట్టారు. దీంతోపాటు తూకంలో అదనంగా 2.5 కేజీలు తీసుకున్నారు.

వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లికి చెందిన రైతు బి.రామకృష్ణ 40 బస్తాల ధాన్యం పండించాడు. డిసెంబరులో వరుసగా వచ్చిన అల్ప పీడనాల ప్రభావంతో ఆలస్యంగా నూర్పులు చేయాల్సి వచ్చింది. ఈ నెల మొదటి వారంలో నూర్పులు చేసి నగరంపల్లి రైతు సేవా కేంద్రానికి తీసుకువెళ్లాడు. లక్ష్యం అయిపోయింది, ప్రభుత్వం అదనంగా కొనుగోలు చేయమంటే కొంటామంటూ తిప్పి పంపారు. ధాన్యం అమ్ముకునేందుకు 20 రోజులుగా రైతు సేవా కేంద్రాల చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు. మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలు ఇవ్వలేదని, అందుకే కొనలేకపోతున్నామంటూ సిబ్బంది బదులిస్తుండడంతో చేసేది లేక కళ్లంలోనే ధాన్యం ఉంచేశాడు. దళారులు 80 కేజీల బస్తాకు 1700 మాత్రమే ఇస్తామని, అదనంగా రెండున్నర కేజీలు ఇవ్వాలని షరతులు పెట్టడంతో, ధాన్యం ఇచ్చేందుకు రైతు అంగీకరించలేదు. ప్రభుత్వం ఎప్పుడు కొనుగోలు చేస్తుందా అని ఎదురుచూస్తున్నాడు. ధాన్యం అమ్ముకునేందుకు రైతు సేవా కేంద్రాలకు వస్తున్న జిల్లాలోని వేలాది మంది రైతులకు ఇదే అనుభవం ఎదురవుతోంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 3,59,495 ఎకరాల్లో వరి వేశారు. ఈ ఏడాది తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. రైతుల అవసరాలు, తిండి గింజలకు పోనూ ఏడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వరకు మార్కెట్‌లోకి రావచ్చని పౌర సరఫరాల సంస్థ అధికారులు అంచనా వేశారు. అన్నీ లెక్క కట్టి చివరకు 4.90 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని అధికారులు నిర్ణయించారు. అందుకనుగుణంగా 630 రైతు సేవా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు జిల్లాలో 4.40 టన్నుల వరకు కొనుగోలు చేశారు.

జిల్లాలో 30 మండలాలు ఉండగా, ప్రస్తుతం 11 కేంద్రాల్లోనే ధాన్యం కొంటున్నారు. మిగిలిన మండలాలకు నిర్దేశించిన లక్ష్యం పూర్తవ్వడంతో, కొనుగోలు ఆపేశారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఆలస్యంగా విత్తనాలు వేయడం, కొన్ని మండలాల్లో అపరాల సాగుతో ఆలస్యంగా నూర్పులు జరగడంతో ఇప్పుడు ఆ మండలాల్లో మాత్రమే అధికారులు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు.

రైతుల వద్ద రెండు లక్షల టన్నుల ధాన్యం

పలు కారణాలతో ఆలస్యంగా ధాన్యం సిద్ధం కాకపోవడంతో చాలా మంది రైతులు ధాన్యం ఇవ్వలేకపోయారు. ఇలా జిల్లాలో, మండలాల్లో వస్తున్న ధాన్యం దిగుబడికి అనుగుణంగా లక్ష్యాలు ఇవ్వకపోవడంతో, కొద్దిమంది రైతులు ఇచ్చేసరికే నిర్దేశించిన లక్ష్యం పూర్తయింది. దీంతో రైతు సేవా కేంద్రాల్లో ట్రక్ షీట్‌లు జనరేట్ కావడం లేదు. ఈవిధంగా జిల్లాలో రెండు లక్షల టన్నుల ధాన్యం వరకు రైతుల వద్దే ఉండిపోయింది.

చెల్లింపులు చేయాల్సి వస్తుందనేనా?

ధాన్యం లక్ష్యం పెంచితే అదనంగా నిధులు కేటాయించాల్సి వస్తుందనే భావన ప్రభుత్వంలో కనిపిస్తున్నట్లుగా ఉంది. రైతుల దగ్గర ధాన్యం తీసుకుంటే వారికి చెల్లింపుల కోసం డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందనే ఉద్దేశంతో ప్రభుత్వం స్పందించడం లేదని తెలుస్తోంది.

ఉత్తర్వులు వస్తే కొనుగోలు చేస్తాం



ప్రభుత్వం జిల్లాకు నిర్దేశించిన లక్ష్యం మేరకు ధాన్యం కొంటాం. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఆయా మండలాలకు ఇచ్చిన లక్ష్యం పూర్తి కావడంతో, ప్రస్తుతం అక్కడ ధాన్యం కొనడం లేదు. ప్రభుత్వం అదనంగా కొనుగోలు చేయాలని ఉత్తర్వులు ఇస్తే ధాన్యం తీసుకుంటాం.

- టి.వేణుగోపాల్,
జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈనెల ఐదో తేదీ నుంచి ప్రాక్టికల్స్ ప్రారంభం కానున్నాయి. పరీక్షల నిర్వహణకు గతంలో అమల్లో ఉన్న జంబ్లింగ్ విధానాన్ని మార్చి ఆయా సబ్జెక్టుల్లో నిపుణులైన అధ్యాపకులను పర్యవేక్షకులుగా నియమించారు. ఒకేషనల్ విద్యార్థులకు ఈనెల ఐదో తేదీ నుంచి మొదటి విడత పరీక్షలు ఆరంభమవుతాయి. ఒకేషనల్ విద్యార్థులకు మూడు విడతల్లో నిర్వహిస్తారు. ఎంపిసి, బైసిపి విద్యార్థులకు మాత్రం ఈనెల 10 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

జూనియర్ కళాశాలలు : 145
ప్రాక్టికల్స్ పరీక్షల కేంద్రాలు: 73
మొత్తం విద్యార్థులు: 24,602

సబ్జెక్టుల వారీగా 30 మార్కులకు ప్రాక్టికల్ పరీక్షలుంటాయి. అందులో రికార్డులకు 5, ప్రయోగాలకు 25 మార్కులు ఉంటాయి. రెండింటిలో కలిపి 11 మార్కులు వస్తే ఉత్తీర్ణులు అవుతారు. సిసి కెమెరాల పర్యవేక్షణలో ప్రయోగాలు నిర్వహించాలి. కొన్ని కళాశాలల్లో సిసి కెమెరాలు కూడా లేవు. ప్రయోగ పరికరాలున్నా ఎప్పుడూ ఉపయోగించింది లేదు. పరీక్షల కోసం పరికరాల దుమ్ము దులుపుతున్నారు. చాలా కళాశాలలకు రసాయనాలు కూడా అందుబాటులో లేవు.

వృత్తి విద్యా కోర్సులకు పరికరాల కొరత

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపిసి, బైసిపితో పాటు వృత్తి విద్యా కోర్సులన్నింటికీ ఇక్కడే ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్నారు. సాధారణ గ్రూపులకు సంబంధించిన అన్ని పరికరాలు అందుబాటులో ఉన్నా, వృత్తి విద్యా కోర్సులకు సరైన పరికరాలు అందుబాటులో లేవు. ఎంఎల్‌టి గ్రూపునకు స్టాఫ్ వాచ్, స్టెతస్కోప్, రక్త గ్రూపు నిర్ధారణ కిట్లు, క్రియాటిన్ కిట్, ఎలక్ట్రోల్ బ్యాలెన్స్ కిట్లు అందుబాటులో లేవు.

పరీక్షల నిర్వహణకు కమిటీలు

ప్రాక్టికల్స్ పరీక్షల నిర్వహణకు పర్యవేక్షకులను కమిటీ సమక్షంలో నియమించాం. రెండు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశాం. సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని కేంద్రాలున్న కళాశాలలను ఆదేశించాం. విద్యార్థుల నుంచి ఎవరైనా డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదులు వస్తే ఆయా కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటాం.

- పి.దుర్గారావు, ఆర్ఐఒ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్‌జికెయుటి అధికారులు

మార్చి 7 నుంచి జాతీయ టెక్నో ఫెస్ట్

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

జాతీయ టెక్నో మేనేజ్‌మెంట్ ఫెస్ట్ (టెక్నివర్స్ 2k25)ను మార్చి 7 నుంచి 9వ తేదీ వరకు ట్రిపుల్ ఐటిలో నిర్వహించనున్నట్లు డైరెక్టర్ కె.వి.జి.డి బాలాజీ తెలిపారు. ఫెస్ట్ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ టెక్నివర్స్‌లో పలు ఐఐటిల ప్రొఫెసర్లు ఎఐ, సెన్సార్, హైడ్రాలజీ, మెకానికల్ బిహేవియర్ ఆఫ్ హై టెంపరేచర్ అల్లాయ్స్, విఎల్ఎస్ఐ, పవర్ ఎలక్ట్రానిక్స్‌పై ప్రసంగిస్తారని తెలిపారు. డిపార్ట్‌మెంటల్ వర్క్‌షాప్స్, టెక్నికల్ క్విజ్, రోబోటిక్స్, టెక్నికల్ పేపర్ ప్రజెంటేషన్ ఇలా 30 పైబడి ఈవెంట్స్ ఉన్నాయని వివరించారు. ఈ టెక్నివర్స్‌కు కన్వీనర్‌గా గేదెల రవి, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ సిహెచ్.తేజ కిరణ్ సివిల్ హెచ్ఒడి కో కన్వీనర్‌గా ఉన్నారు. కార్యక్రమానికి అడ్మినిస్ట్రేటివ్ అధికారి ముని రామకృష్ణ, డీన్ అకడమిక్స్ కొర్ల మోహనకృష్ణ చౌదరి, ఫైనాన్స్ అధికారి సిహెచ్.వాసు, అకౌంట్స్ అధికారి కె.మోహనరావు, డిపార్ట్‌మెంట్ హెచ్ఒడిలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తీర ప్రాంతాల్లో గస్తీ పెంపు

విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి

ప్రజాశక్తి - గార

తీర ప్రాంతాల్లో గస్తీని పెంచాలని విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి మెరైన్ పోలీసు అధికారులను ఆదేశించారు. మండలంలోని కళింగపట్నం తీరంలో గల మెరైన్ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. తీర ప్రాంత భద్రత దృష్ట్యా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ముందస్తు సమాచార సేకరణ తప్పనిసరి అని అన్నారు. సముద్రతీర ప్రాంతంలో అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా పెట్టాలన్నారు. సిబ్బంది, వివరాలు, పనితీరుపై ఆరా తీసి ప్రతిఒక్కరూ బాధ్యతతో విధులు నిర్వర్తించాలన్నారు.



మెరైన్ పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న డిఐజి గోపీనాథ్ జట్టి



ప్రచారం చేస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

విజయగౌరికి తొలి ప్రాధాన్యతా ఓటు వేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోరెడ్ల విజయగౌరికి తొలి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని ఉద్యోగ సంఘ నాయకులు కె.శ్రీనివాసు, ఎం.ప్రభాకరరావు కోరారు. నగరంలోని సన్ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వారు మాట్లాడారు. కళాశాల అధ్యాపకులను కలిసి తొలి ప్రాధాన్యతా ఓటు వేయాలని కోరారు. ఆమె ఉద్యమ అనుభవాలను వివరించారు. అధ్యాపకులు, ఉపాధ్యాయ సమస్యలపై అవగాహన కలిగి నిజాయితీ గల అభ్యర్థి విజయగౌరి అని అన్నారు. ప్రభుత్వంతో ఉపాధ్యాయ, ఉద్యోగ, అధ్యాపకుల సమస్యలపై పోరాడ గల వ్యక్తి అని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యవస్థని నిర్వీర్యం చేస్తున్నాయని, ఈ పరిస్థితుల్లో ఆ విధానాలను సరిచేసే పోరాటాలను ముమ్మరం చేయడానికి ఎమ్మెల్సీ ఎన్నికలను వేదికగా ఎంచుకుని ఆమెను గెలిపించాలని కోరారు.

ఫీజు పోరు మార్చి 12కి వాయిదా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

విద్యార్థులకు వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని కోరుతూ ఈనెల ఐదో తేదీన తలపెట్టిన ఫీజు పోరు కార్యక్రమాన్ని మార్చి 12వ తేదీకి వాయిదా వేసినట్లు వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని మెజార్టీ జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు ఈ విషయాన్ని గమనించాలని, పోరుబాటకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.



నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

కార్మిక చట్టాలను కొనసాగించాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

స్వాతంత్య్రానికి ముందు నుంచి కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేస్తే పోరాటం ఉధృతం చేస్తామని సిఐటియు నాయకులు సంబూరి షణ్ముఖరావు స్పష్టం చేశారు. శ్రీనివాసనగర్ రోడ్డులోని రద్దుకు వ్యతిరేకంగా మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్లమెంట్లో ఎటువంటి చర్చ లేకుండా 2019లో వేతనాల కోడ్ను, 2020లో పారిశ్రామిక సంబంధాల కోడ్ను, సామాజిక భద్రత కోడ్ను, వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితులు కోడ్లను ఆమోదించిందన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నిబంధనలకు వ్యతిరేకంగా అమలు చేయాలని సిద్ధంగా ఉందన్నారు. ఏ సమయంలోనైనా అమలు ఉత్తర్వులు ఇస్తామని ఇటీవల కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారాం ప్రీ బడ్జెట్ సమావేశంలో కార్మిక నాయకుల సమక్షంలో ప్రకటించిందన్నారు. దీనిని కార్మిక నాయకులంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్మిక వ్యతిరేక విధానాలను, లేబరు కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బగాది వాసుదేవరావు, తిర్లంగి అప్పన్న, గిరిబాబు, హెచ్.ఖన్నురరావు, గోపాల్, ఎండయ్య పాల్గొన్నారు.

భళా... అభిజిత్

ప్రజాశక్తి- కవిటి

జాతీయస్థాయి ప్రతిభా పోటీ పరీక్షల్లో మొదటి ర్యాంకు సాధించిన మండలంలోని ముత్యాలపేటకు చెందిన జల్లు అభిజిత్ సత్తా చాటాడు. ఈ సందర్భంగా ఎంఇఒ ధనుంజయ మజ్జి మాట్లాడుతూ క్రమశిక్షణ, అంకితభావం, పోటీతత్వం విద్యార్థులను ఉన్నత స్థానాల్లో నిలబెడతాయని అన్నారు. అన్ని విభాగాల్లో అద్భుత ప్రతిభ చూపిన అభిజిత్ మొదటి స్థానం కైవసం చేసుకున్నాడని కొనియాడారు. ప్రధానోపాధ్యాయులు జి.శాంతి మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నిర్వహించిన ఎడ్యుకేషనల్ ఎపిఏస మెరిట్ టెస్ట్ 2025లో పదో తరగతి విభాగం నుంచి అభిజిత్ ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. ఉన్నతికోసం నిర్వహించిన ఈ జాతీయ స్థాయి పోటీల్లో ప్రతి జిల్లా నుంచి ముగ్గురిని ఎంపిక చేస్తారని, విజేతకు రూ.8వేల నగదు బహుమతి కూడా అందిస్తారని తెలిపారు. ఫిబ్రవరి 7న విజయవాడలో నిర్వహించనున్న కార్యక్రమంలో అభిజిత్కు పురస్కారం అందిస్తారని అన్నారు. అనంతరం అభిజిత్ను పాఠశాల ఆవరణలో దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఆర్.చిరంజీవిరావు, గ్రామ పెద్దలు పి.చంద్రశేఖరం, పి.పద్మనాభం, ఉపాధ్యాయులు కె.రామకృష్ణ, ఎస్.కృష్ణ, మొర్రి గోపి, అప్పలరాజు, సింహాచలం పాల్గొన్నారు.


అభిజిత్ను అభినందిస్తున్న ఎంఇఒ ధనుంజయ

చురుగ్గా అభివృద్ధి పనులు

ప్రజాశక్తి- టెక్కలి

మండలంలోని నౌపడ రైల్వే కూడలిలో రూ.19 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. అమృత మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా రైల్వే కూడలి స్టేషన్లో పలు మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఒకప్పుడు ఉన్న టికెకట్ బుకింగ్ కౌంటర్గా ఉన్న ప్రదేశాన్ని ప్లాట్ఫాంగా మార్చనున్నారు. స్టేషన్కు ప్రధాన ద్వారం వద్ద రైల్వే టిక్కెట్ బుకింగ్ కౌంటర్, ప్రయాణికులు వేచి ఉండే గదులు వంటివి నిర్మాణం చేపడుతున్నారు. ప్రస్తుతం ఉన్న ఫుట్ బ్రిడ్జి స్థానంలో నూతనంగా మరో ఫుట్ బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారు. అదనంగా మరో బ్రిడ్జి నిర్మించనున్నారు. ప్రస్తుతం స్టేషన్లో రెండు ప్లాట్ పారాలు వినియోగంలో ఉండగా, నౌపడ-గుణుపూర్ రైలు కోసం మూడో ప్లాట్ ఫారం ఉంది. అది అంతగా వినియోగంలోకి రావడం లేదు ప్రస్తుతం సేషన్లో ప్రయాణికులు వేచి ఉండే షెల్టర్లు రెండు మాత్రమే ఉన్నాయి. వాటినీ విస్తరించనున్నారు. ప్రస్తుతం


నిర్మిస్తున్న ప్రయాణికుల షెల్టర్

అభివృద్ధి పనులు చేపడుతుండడంతో ప్రయాణికులకు సరైన సదుపాయాలు దూరమవుతున్నాయి. ప్రయాణికులకు వేచి ఉండే గదులు అందుబాటులో లేకపోవడంతో చాలావరకు ప్రయాణికులు స్టేషన్ ఆవరణలో ఉన్న ప్లాట్ఫారంపైనే విశ్రమించాల్సి వస్తుంది. అయితే అమృత మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా స్టేషన్ అభివృద్ధి పనులు నిధులు మంజూరు విడతల వారీగా విడుదలవుతున్నాయి. దీంతో పనులు ఆలస్యంగానే ప్రారంభమయ్యాయి. నౌపడ రైల్వే కూడలిలో ప్రస్తుతం చేపడుతున్న పనులు పూర్తయితే కూడలి స్టేషన్ మరింత ఆకర్షణీయంగా మారుతుంది. అయితే ప్రస్తుతం స్టేషన్లో అందుబాటులో నీటి సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు పలు అవస్థలకు గురికావాల్సి వస్తుంది. స్టేషన్ ఆవరణలో నీటి నిల్వలకు ఆవకాశం లేకపోవడం, బోర్లు తవ్వినా ఫలితం లేకపోవడంతో పది కిలోమీటర్లు దూరంలో ఉన్న కోటబొమ్మాళి స్టేషన్ పరిసరాల నుంచి నీటి సదుపాయానికి సౌకర్యాలు ఏర్పాటు చేసుకున్నారు. అక్కడ నుంచి పైపులైన్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. దీంతో నీటికి ఇబ్బందులు ఏర్పడడంతో స్టేషన్ ఆవరణలో ఉన్న కొన్ని మరుగుదొడ్లు మూతబడగా, ప్రయాణికులకు దాహార్తి తీర్చాల్సిన కొన్ని కుళాయిలు అలంకారప్రాయంగానే మిగిలి ఉన్నాయి. వచ్చే వేసవి తీవ్రత దృష్ట్యా స్టేషన్కి అదనంగా నీరు అవసరం. ప్రయాణికుల అవసరాలు తీర్చగలరా? లేదా? అనేది సందేహంగా మిగిలి ఉంది. కాగా, స్టేషన్ ఆవరణలో ప్రయాణికులకు క్యాంటిన్ సౌకర్యం ఉన్నా... అది పూర్తిస్థాయిలో అవసరం తీర్చలేకపోతుంది. అయితే నీటి లభ్యత లేకపోవడం వల్లే ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికైనా స్టేషన్లో పూర్తి స్థాయిలో నీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

రబీకి నీటి కష్టాలు


నరేంద్రపురం వద్ద నీరు లేని వంశధార కాలువ

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని రైతులు రబీ పంటలపై ఆశతో వేరుశనగ సన్ హంప్తో పాటు నందిగాం పెంటవూరు, నర్సిపురం, దిమిలాడ, జల్లపల్లి, దేవలభద్ర తదితర గ్రామాల్లో అంతంత మాత్రం నాట్లు వేశారు. ఈ ఆరు గ్రామాల్లో 250 వరకు ఎకరాల్లో రబీలో భాగంగా వరి నాట్లు వేశారు. అయితే ఇటీవల వంశధార కాలువలో నీరు విడిచిపెడుతున్నామన్న అధికారుల ప్రకటనలో రైతుల కళ్లో ఆనందం, ఆశలు చిగురించాయి. అయితే ఖరీఫ్ చివరి దశలో వంశధార కాలువ ద్వారా అందిన నీటితో రైతులు ఆశించిన ఫలితాన్ని పొందగలిగారు. అదే స్ఫూర్తితో చెరువుల్లో నింపిన వంశధార నీటితో రబీలో వేరుశనగ వంటి పంటలు పండించుకోవాలని ఆశతో వేణుగోపాలపురం, కొండపేట, మనిగాం, మొజవాడ, పాలూరు, వల్లభరాయనపేట, భరణిగాం, దేవాడ గ్రామాల్లో 700 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. చెరువుల్లోని నీరు రెండు తడ్లకు పూర్తి కావడంతో రైతులు ఇప్పుడు వంశధార నీటి వైపు చూస్తున్నారు. అధికారులు చొరవ చూపి రబీ పంటలకు సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.


మాట్లాడుతున్న దాలయ్య

విజయగౌరిని గెలిపించుకుందాం

టెక్కలి: ఉపాధ్యాయ రంగ సమస్యలు పరిష్కారం దిశగా చేసే పోరాటాలకు స్ఫూర్తినిచ్చే విధంగా సహకరించాలని యుటిఎఫ్ జిల్లా సహధ్యక్షులు కురమాన దాలయ్య పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని పలు ప్రయివేట్ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుల వద్దకు మంగళవారం వెళ్లి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి కోరెడ్ల విజయగౌరీని గెలిపించాలని కోరారు. ప్రభుత్వం నుంచి తమకు రావాల్సిన హక్కులను సాధించుకోవాలంటే చట్టసభల్లో ఉద్యమ స్ఫూర్తి కలిగిన వాళ్లు అవసరమని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పాలవలస ధర్మారావు, ప్రధాన కార్యదర్శి తమ్మినేని వైకుంఠరావు, నేపాల్ కృష్ణారావు, రోణంకి విజయ్కుమార్ పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

పలాస : పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సముదాయ పరిధిలో పారా లీగల్ వాలంటీర్ల నియమానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్ఛార్జి మెజిస్ట్రేట్ సిహెచ్.హరిప్రియ ఒక ప్రకటనలో తెలిపారు. పారా లీగల్ వాలంటర్ పోస్టులకు సంబంధించి ఉద్యోగ విరమణ పొందిన వారు, అంగన్వాడీ కార్యకర్తలు, న్యాయ విద్యార్థులు, రాజకీయతర సభ్యులు, రాజకీయతర సభ్యులు, సేవా దృక్పథం కలిగిన ప్రభుత్వ సంఘం సభ్యులు, స్వయం సహాయక సభ్యులు అర్హులని అన్నారు. ఈ నెల 7లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

'యురేకా సైన్స్ ఎక్స్పో'ను విజయవంతం చేయాలి

ఆమదాలవలస : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన నిర్వహించనున్న యురేకా సైన్స్ ఎక్స్పో ను విజయవంతం చేయాలని గౌరవాధ్యక్షులు బొడ్డేపల్లి జనార్ధనరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని లక్ష్మీనగర్ వీధిలో ఉన్న మున్సిపల్ హైస్కూల్లో పాధ్యాయులతో, విద్యార్థులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన సైన్స్ ఎక్స్పెరిమెంట్స్ ఆన్లైన్ వీడియో కాంటెస్ట్ను 'సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం- సుస్థిరాభివృద్ధి', మూఢనమ్మకాలు-శాస్త్రీయ దృక్పథం' అనే అంశాలపై 8, 9, 10 తరగతుల విద్యార్థులకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు బొడ్డేపల్లి మోహనరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన, ప్రయోగాల నిర్వహణలో స్వీయ అనుభవాన్ని పొందేందుకు, భవిష్యత్ శాస్త్రవేత్తలుగా, విజ్ఞానవంతులుగా రూపొందించేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. ఫిబ్రవరి 15న ఆఖరు తేదీ అని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొడ్డేపల్లి రామకృష్ణ, పిఆర్టియు మండల నాయకులు గోపి పాల్గొన్నారు. అనంతరం యురేకా సైన్స్ ఎక్స్పో పోస్టర్ను విడుదల చేశారు.


పోస్టర్ను ఆవిష్కరిస్తున్న జనవిజ్ఞాన వేదిక నాయకులు


అభినందిస్తున్న విప్ అశోక్

ప్రభుత్వ విప్ అభినందనలు

కంచిలి : బెంగళూరులో జనవరి 27 నుంచి ఐదు రోజులు పాటు నిర్వహించిన హ్యాకతాన్ సైన్స్ ప్రాజెక్ట్ పోటీల్లో మండలంలోని ఎం.ఎస్.పల్లి ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులకు ఇన్నోవేషన్ అవార్డును గెలుపొందారు. ఈ మేరకు పాఠశాలకు చెందిన ఆరాధ్య పాణిగ్రాహి, శ్రద్ధాంజలి మహంతి, యాస్మిన్ చౌదరి, రితిక బడిత్య, ఎం.శ్రద్ధాంజలి, గైడ్ ఉపాధ్యాయుడు సత్యనారాయణలను ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ మంగళవారం అభినందించారు. భవిష్యత్లో సైతం ఇటువంటి ఎన్నో మంచి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, గుజరాత్, ఝార్కండ్, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాలకు చెందిన 57 మంది ఈ ప్రాజెక్టుల సమర్పణలో పాల్గొన్నారు. ˇశువుల కోసం తాము రూపొందించిన మోనిటరింగ్ పరికరానికి ఇన్నోవేషన్ అవార్డు లభించినట్లు విద్యార్థులు తెలిపారు.

మెరిసిన అక్కాచెల్లెళ్లు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని జయరామచంద్రపురానికి చెందిన జనసేన నాయకులు అట్టాడ వాసుదేవరావు ఇద్దరు కుమార్తెలు జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యారు. తమిళ నాడు రాష్ట్రం మధురైలో నిర్వహించిన జాతీయస్థాయి స్కేటింగ్ వెయ్యి మీటర్ల పోటీలు, రిలే 800 మీటర్ల పోటీల్లో ఎనిమిదేళ్ల అట్టాడ హాన్విక రజత పతకం, రిలే 800 మీటర్ల స్కేటింగ్ పోటీలో ఐదేళ్ల అట్టాడ మాన్వితలు జాతీయ స్కేటింగ్ పోటీలో రజిత పతకం సాధించి ఛాంపియన్ షిప్, స్పీడ్ స్కేటింగ్ ఫెడరేషన్ అవార్డును గెలుచుకున్నారు. గతేడాది డిసెంబరులో బెంగళూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.


పతకాలతో హాన్విక, మాన్విత


అవగాహన కల్పిస్తున్న దాసు

కేన్సర్పై అవగాహన

సోంపేట: కేన్సర్ గురించి అవగాహన పెంపొందించడానికి, దాని నివారణ గుర్తింపు చికిత్సను ప్రోత్సహించేందుకు ఏటా ఫిబ్రవరి 4న ప్రపంచ కేన్సర్ దినోత్సవం నిర్వహిస్తున్నామని స్థానిక సంస్కార భారతి విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ నిమ్మన దాసు అన్నారు. విద్యాసంస్థల ప్రాంగణంలో కళాశాల చైర్మన్ వై.దేవరాజు, ప్రిన్సిపాల్ బి.శ్రీరామ్మూర్తి, ఎఒ వడగ పాపారావు అధ్యక్షతన విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ కేన్సర్ డే లక్ష్యం ప్రజల్లో అవగాహన పెంచడం తద్వారా దానిని తగ్గించడం, బాధపడుతున్న వారికి మద్దతివ్వడం ముఖ్య ఉద్దేశమని అన్నారు. కార్యక్రమంలో బిసిడిఇ కో-ఆర్డినేటర్ మాదిన శరత్బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.


నేత్రాలను పరిశీలిస్తున్న వైద్యాధికారి శ్రీనాథ్

నేత్ర వైద్య పరీక్షలు

పోలాకి: పోలాకిలో డాక్టర్ సాంబమూర్తి ఆధ్వర్యాన మంగళవారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మేరకు వంద మందికి నేత్రాలను పరీక్షించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శస్త్ర చికిత్సకు విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్కు రిఫర్ చేసి బస్సుపై ఉచితంగా పంపించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనాథ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన క్రీడలు

టెక్కలి : పాఠశాల స్థాయి టెక్కలి నియోజకవర్గ క్రీడా పోటీలు మంగళవారంతో ముగిశాయి. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన ఈ పోటీల్లో టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల నుంచి ప్రభుత్వ పాఠశాలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. రన్నింగ్, టెన్నికాయింట్, వంటి క్రీడలు నిర్వహించారు. విజేతలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. నియోజకవర్గ ఇన్ఛార్జి బాడాన నారాయణరావు ఆధ్వర్యాన నిర్వహించిన ఈ పోటీల్లో వ్యాయామ ఉపాధ్యాయులు కె.కె.రామిరెడ్డి, ప్రకాష్, జగదీష్, రఘునాథరావు, రమేష్, త్రినాథరావు, లక్ష్మణరాజా పాల్గొన్నారు.

గ్రంథాలయానికి దారేది?

ప్రజాశక్తి- కవిటి

మండల కేంద్రంలోని శాఖాగ్రంథాలయం ఎక్కడుందో కూడా కొత్త తరానికి తెలిసిన పరిస్థితి కనిపించడం లేదు. ప్రధాన రహదానికి ఆనుకునే గ్రంథాలయం ఉన్న దాని ముఖద్వారం మాత్రం ప్రధాన రహదారికి వ్యతిరేక దిశలో ఉండడం ప్రధాన సమస్యగా మారింది. అంతేకాకుండా ఎలాగో ప్రధాన రహదారి వైపు ముఖద్వారం లేకపోవడంతో అటువైపు షాపులు, తోపుడు బండ్లు పెట్టడంతో గ్రంథాలయం పేరు కూడా ప్రస్తుతం కనిపించని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రంథాలయం స్థలం ఆక్రమణకు గురికాకుండా అందరికీ గ్రంథాలయం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పాఠకులు కోరుతున్నారు.


ఆక్రమణకు గురైన గ్రంథాలయ పరిసరాలు

ఇన్ఛార్జి పాలనలోనే...

ప్రస్తుతం ఇచ్ఛాపురం గ్రంథాలయ అధికారి పూర్ణచంద్ర బెహర కవిటి గ్రంథాలయ అధికారిగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. దీంతో పూర్తిస్థాయిలో గ్రంథాలయ అధికారి అందుబాటులో లేకపోవడం గ్రంథాలయ నిర్వహణలో లోపంగా కనిపిస్తోంది. గతంలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించి విద్యార్థులను, స్థానికులను ఆహ్వానించేవారు. ఆ విధంగా విద్యార్థులు, స్థానికులు గ్రంథాలయంపై ఆసక్తి చూపేవారు. కానీ, ప్రస్తుతం గ్రంథాలయ అధికారి లేకపోవడంతో వారోత్సవాలు కూడా నిర్వహించలేదు. దీని ప్రభావం గ్రంథాలయ నిర్వహణపై పడుతోందని పాఠకులు అంటున్నారు.

వజ్రపుకొత్తూరు : రథసప్తమి సందర్భంగా యాత్రికులు సముద్ర స్నానాలకు పోటెత్తారు. మండలంలోని కంబలరాయుడుపేట సముద్ర తీరంలో అధిక సంఖ్యలో మహిళలు, పిల్లలు సముద్ర స్నానాలు ఆచరించారు. స్థానిక దేవాలయ అభివృద్ధి కమిటీ సముద్రంలో స్నానం చేసేవారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టారు. గజఈత గాళ్లతో బోటును ఏర్పాటు చేశారు. మహిళలు దుస్తులు మార్చుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. యాత్రికులకు దాతల సహకారంతో ప్రసాదాలు పంచిపెట్టారు. వజ్రపుకొత్తూరు పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు, మాజీ సర్పంచ్ కంబాల దానేశ్, ఎంపిటిసి కారి వెంకటరావు, సర్పంచ్ వంక చిరంజీవి పాల్గొన్నారు.

యువకుడు ప్రాణాలు కాపాడిన రామా సేవా సంఘం ప్రతినిధులు

రథసప్తమి సందర్భంగా సముద్ర స్నానానికి వచ్చిన యువకుడి ప్రాణాలు రామా సేవా సంగం ప్రతినిధులు కాపాడారు. అనకాపల్లి జిల్లా చోడవరానికి చెందిన సోమరెడ్డి మణి


వజ్రపుకొత్తూరు : ప్రాణాలతో బయటపడిన మణి

'జన'సంద్రం

వేకువజామున సుమారు 4 గంటల సమయంలో రథసప్తమి సందర్భంగా అక్కుపల్లి శివసాగర్ బీచ్లో సముద్ర స్నానం చేస్తున్నాడు. సముద్ర అలల తాకిడికి నీటిలో మునిగిపోయాడు. ఆ సమయంలో అక్కడ సేవా కార్యక్రమాలు చేపడుతున్న అక్కపల్లి శ్రీరామా సేవా సంఘం ప్రతినిధులు, మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు కాస చలపతి, సభ్యులు మోస వరప్రసాదరావు, ఈశ్వరరావు, ఎం.ఎల్.నాయుడు, నారాయణ, మహేష్, అనిల్, బాలకృష్ణ, ఢిల్లీరాజు వెను వెంటనే స్పందించి యువకుడిని కాపాడి ప్రథు చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం 108లో పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగా ఉంది. ఎటువంటి ప్రాణాపాయం లేదని డాక్టర్లు తెలిపారు.

నౌపడ : సంతబొమ్మాళి మండలం భావనపాడు, సున్నాపల్లి, మేఘవరం సముద్రతీరంలో సప్తమి సందర్భంగా సముద్ర స్నానాలు చేయడానికి వచ్చిన యాత్రికులతో తీరం కోలహలంగా మారింది. వేకువజాము నుంచే పెద్ద ఎత్తున యాత్రికులు సముద్ర స్థానాలు చేసి సూర్యోదయాన్ని తిలకించడానికి తీరానికి చేరుకున్నారు. తీరంలో ఇసుకతో లింగాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా ఉసిరికాయలతో సముద్రంలో మునిగి తలంటు స్నానం చేశారు. సముద్రంలో సూర్యోదయాన్ని తిలకించి మొబైల్ కెమెరాలతో ఫోటోలు తీసి సోషల్ మీడియాలో పంచుకున్నారు. పెద్ద ఎత్తున యాత్రికులు ధరలు రావడంతో భావనపాడు కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ ఫోర్స్, నౌపడ పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.


నౌపడ : భావనపాడు సముద్రంలో స్నానం చేస్తున్న యాత్రికులు

సరుబుజ్జిలి : మండలంలోని పురుషోత్తపురంలో ఉన్న సూర్యనారాయణ స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వంశధార నది పరివాహక ప్రాంతంలో ఉన్న ఈ ఆలయానికి తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో యాత్రికులు పోటెత్తారు.

కవిటి: కడలి కనువిందుగా మారింది. రథసప్తమి వేడుకలు పురస్కరించుకుని వేకువ జామునుంచే భక్తులు తీరానికి చేరుకున్నారు. అటు కపాసుకుద్ది నుంచి ఇటు కళింగపట్నం వరకు భక్తులతో తీరం పోటెత్తింది. ఉదయ భానుని తొలి కిరణాల కోసం తీరం భక్త జన సంద్రంగా మారింది. కవిటికొత్తూరు వద్ద బివికె పాఠశాల, కవిటి కళ్యాణి ఆంగ్ల పాఠశాలల్లో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సూర్య నమస్కారాలతో యోగాసనాలు వేశారు.

సిసి రోడ్డు నిర్మాణ పనులు అడ్డగింత


నిలిచిన పనులు

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని కొత్తకోట పంచాయతీ బట్టుపాలెంలో పల్లెపండగా కార్యక్రమంలో భాగంగా సిసి రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు రూ.5 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు టిడిపి కూటమి నాయకుడు కిల్లాన శ్రీనివాసరావు సిసి రోడ్ల నిర్మాణానికి ప్రొక్లెయినర్తో మంగళవారం పనులు చేపట్టారు. దీంతో కొత్తకోట గ్రామానికి చెందిన వ్యక్తులు కొందరు వచ్చి తమ స్థలంలో నుంచి సిసి రోడ్డు నిర్మించడానికి వీల్లేదని పనులు అడ్డుకున్నారు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఎప్పటి నుంచో సిమెంట్ రోడ్డు, వీధి కాలువలు నిర్మాణాల కోసం ఎదురు చూస్తున్నామని గ్రామస్తులు వాపోయారు. నాయకులు, అధికారులు స్పందించి సిసి రోడ్లు, కాలువలు నిర్మించాలని కోరుతున్నారు.

ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

రణస్థలం రూరల్: మండలంలోని కమ్మసిగడాంలో ఈ నెల 7 నుంచి నిర్వహించనున్న మహాలక్ష్మితల్లి ఉత్సవాలకు పకడ్బందీగా ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే, ఆలయ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. అలాగే అదే రోజు రాత్రి గురప్పదొరల కళ్యాణం నిర్వహించనుమన్నారు. అందుకు సంబంధించిన పెళ్లిరాట రథసప్తమి ఆలయ కమిటీ ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించామన్నారు. మూడురోజుల పాటు నిర్వహించనున్న జాతరకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు వి.వి.ఎస్.వి.ప్రసాద్, ఉపాధ్యక్షులు వెలిచేటి రామకృష్ణ, వెలిచేటి రాజారవిచంద్ర, వెలిచేటి తేజ, కోశాధికారి వెలిచేటి రాజశేఖర్, మన్నె లక్ష్మీప్రసాద్, వెలిచేటి సురేష్కుమార్, వెలిచేటి మురళీధర్, వెలిచేటి రాయుడు, మన్నె కృష్ణానందం, వి.జె.ఎస్.ఎల్.పి.మౌళి, జి.రఘునాథ్, మన్నె తాతీయులు, సత్యనారాయణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఈశ్వరరావు

అపజయమే విజయానికి మెట్టు

ప్రజాశక్తి టెక్కలి రూరల్

జయాప జయాలు ఎలా ఉన్నా విద్యార్థులు పోటీలో పాల్గొనడమే ప్రధానమని కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా (సిఎస్ఐ) హైదరాబాద్ కార్యదర్శి డాక్టర్ డి.వి.రమణ అన్నారు. టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యాన రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి టెక్నో విజన్ ముగింపు సమావేశంలో మంగళవారం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయాలు సాధించిన గొప్పగొప్పవారంతా ఎన్నోసార్లు ఓటమి చెందిన వారేరని అన్నారు. ప్రయత్న లోపం లేకుండా లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. గౌరవాతిథి సిఎస్ఐ చైర్మన్ సిహెచ్.సుధాకర్ మాట్లాడుతూ క్రమశిక్షణగా టెక్నోవిజన్ నిర్వహించడంపై ఐతమ్ నిర్వాహకులకు అభినందించారు. కన్వీనర్, సిఎస్ఇ హెచ్ఐడి డాక్టర్ వై.రమేష్ పోటీల గురించి వివరిస్తూ 'ఇన్నోవేట్ నౌ, కోడ్ వార్, డిబగ్ చాలెంజ్, మైండ్ మాస్టర్' వంటి పోటీలను నిర్వహించి విజేతలకు రూ.50 వేల వరకు నగదు బహుమతులను, ప్రశంసాపత్రాలను అందజేశామన్నారు. ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాల, కాకినాడ ఆదిత్య వుమెన్స్ డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం ప్రభుత్వ పోలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు బహుమతులు పొందిన వారిలో ఉన్నారని తెలిపారు. సమావేశంలో డీన్ డాక్టర్ యు.డి.ప్రసన్న, కో-కన్వీనర్ డాక్టర్ టి.రవికుమార్, హెచ్డిలు, అధ్యాపకులు, విద్యార్థి కన్వీనర్లు ప్రణవ్, సంధ్యన పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రమణ


మజ్జిగను అందజేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

యాత్రికులకు 'స్వచ్ఛంద' సేవలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రథసప్తమి వేడుకల్లో భాగంగా తరలి వచ్చిన యాత్రికులకు లయన్స్ క్లబ్ హర్షవల్లి ఆధ్వర్యాన వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. అరసవల్లి కూడలి వద్ద ప్రత్యేక వైద్య శిబిరాన్ని క్లబ్ వ్యవస్థాపకులు హారికాప్రసాద్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్య సేవలతో పాటు పది వేల మందికి ఉచిత ఆహారాన్ని పంపిణీ చేశారు. ఎండ తీవ్రత కారణంగా వడదెబ్బకు గురి కాకుండా ఉండేందుకు మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు, ఒఆర్ఎస్ ప్యాకెట్లను యాత్రికులకు అందజేశారు. క్లబ్ జోనల్ చైర్పర్సన్ కరణం శోభారాణి ప్రారంభించారు. కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ ఊణ రంగనాథ్, క్లబ్ అధ్యక్షులు వావిలపల్లి జగన్నాథనాయుడు, క్లబ్ కార్యదర్శి మణిశర్మ, సభ్యులు నిహార్, జె.ఎన్.టి.నాయుడు, జ్యోతిర్మయి, చంద్రమౌళి, గుడ్ల గౌతం పాల్గొన్నారు.

రథసప్తమి వేడుకల్లో భాగంగా వచ్చిన యాత్రికులకు సూర శ్రీనివాసరావు నగరంలోని కళింగ రోడ్డును ఆనుకుని అరసవల్లి మిల్లు కూడలి వద్ద పులిహోరా పంపిణీ చేశారు. ఉదయం నుంచి ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన ఈ కార్యక్రమం నిర్వహించారు. జిల్ ఫౌండేషన్ ఆధ్వర్యాన మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు. తైక్వాండో శ్రీను ఆధ్వర్యాన సింహద్వారం వద్ద గల ఎస్ఎన్ కళ్యాణ మండపం వద్ద పులిహోర పంపిణీ చేశారు. ఆయన మేనల్లులు పుక్కళ్ల నవీన్, మజ్జి గౌతమ్, జోగిపాటి వంశీల ఆధ్వర్యాన పంపిణీ చేశారు. మాజీ సైనికుల సంఘాల జెఎసి ఆధ్వర్యాన యాత్రికులకు తాగునీరు, మజ్జిగ, టీ, పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు ఎస్.ఎన్.మూర్తి, వైస్ ప్రెసిడెంట్ సనపల రామారావు, జనరల్ సెక్రటరీ అమ్మాజీరావు, గౌరవాధ్యక్షులు మూర్తి, శంకర్ నారాయణ పాల్గొన్నారు. నగరంలోని పలు స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంస్థల ఆధ్వర్యాన పులిహోరా, పొంగలి పంపిణీ చేశారు. అలాగే అరసవల్లి రోడ్డులో అంధవరపు సూరిబాబు తాగునీరు, పులిహోరా పంపిణీ చేశారు.

బూర్జ : రథసప్తమి సందర్భంగా మండలంలోని తుడ్డలి షిరిడి సాయిబాబా ఆలయ వార్షికోత్సవం సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కనపాక చౌదరి నాయుడు, విజయలక్ష్మిల ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పరిసర ప్రాంతాల నుంచి 1500 మంది యాత్రికులు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న హారికాప్రసాద్



మజ్జిగను అందజేస్తున్న సూర శ్రీను



రోగికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సురేష్

యాత్రికులకు, విధినిర్వహణలో ఉద్యోగులకు, పోలీసులకు లయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యాన సన్ రైజ్ ఆస్పత్రి అధినేత డాక్టర్ బొడ్డేపల్లి సురేష్, క్లబ్ సెక్రటరీ డాక్టర్ పైడి సిందూరలు వైద్య పరీక్షలు నిర్వహించారు. నగరంలోని అరసవల్లి రోడ్డులోని హెచ్డి ఎఫ్సి బ్యాంకు ఆవరణలో సుగర్, బిపి, జ్వరం, జలుబు, దగ్గు తదితర రోగాలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం పులిహోరా అందజేశారు. కార్యక్రమంలో నటుకుల మోహన్, జోన్ చైర్ పర్సన్ బాడాన దేవభూషణరావు, ఇంటర్నేషనల్ జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్, ట్రెజరర్ భారతి పాల్గొన్నారు.



ఎచ్చెర్ల : సూర్య నమస్కారాలు చేస్తున్న విద్యార్థులు



పలాస : సూర్య నమస్కారాలు చేస్తున్న అధ్యాపకులు



శ్రీకాకుళం అర్బన్ : యోగా చేస్తున్న మహిళలు

సామూహిక సూర్య నమస్కారాలు

ఎచ్చెర్ల : రథసప్తమి సందర్భంగా ట్రిపుల్ ఐటిలో విద్యార్థులు సామూహిక సూర్య నమస్కారాలు నిర్వహించారు. అనంతరం క్విజ్, వక్తృత్వ, యోగా ఆసనాలు విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు సంచాలకులు బాలాజీ బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ముని రామకృష్ణ, డీన్ మోహన్‌కృష్ణ చౌదరి, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ గేదెల రవి, యోగా విభాగాధిపతి డాక్టర్ ఈశ్వరరావు, శిక్షకులు అర్చన, ముకుందరావు పాల్గొన్నారు.

పలాస : సూర్య నమస్కారాలతో ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చని పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి అన్నారు. రథసప్తమి సందర్భంగా మంగళవారం క్రీడా మైదానంలో విద్యార్థులతో సూర్య నమస్కారాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.వెంకటరమణ ఐక్యూ ఎసి కో-ఆర్డినేటర్ సైన్స్ విభాగ అధ్యక్షులు ఎన్.శ్రీనివాస పట్నాయక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : కొంక్యాన గోవిందరాజులు ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్, వాకర్స్ ఇంటర్నేషనల్-102 గవర్నర్ కొంక్యాన మురళీధర్, షిర్డీ సాయి యోగా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన నగరంలోని విశాఖ-బి కాలనీలో 200 మంది మహిళలు యోగ ప్రదర్శన నిర్వహించారు. ఈ వేడుకలను ట్రస్టు డైరెక్టర్ కొంక్యాన వేణుగోపాల్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పిలుపునిచ్చారు. యోగ సాధన వల్ల ఆరోగ్యంతో పాటు ఆలోచన సరళిలో మార్పులు వస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు మధుకర్ విలేకర్, చింతాడ కృష్ణమోహన్, బొడ్డేపల్లి సురేష్, హర్షవల్లి, రిటైర్డ్ జిల్లా జడ్జి పప్పల జగన్నాథరావు, వాకర్స్ గవర్నర్ కొంక్యాన మురళీధర్, వాకర్స్ ప్రతినిధులు వివేకానంద, సుగంధం సంజీవరావు, రామారావు, నాగేశ్వరరావు, పాండ్రంకి మురళీకృష్ణ, తంగి స్వాతి పాల్గొన్నారు.

పాల సేకరణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రెండు దశాబ్దాలుగా అద్దె భవనంలో పాల సేకరణ నిర్వహించారని, ఇక నుంచి ఆ ఇబ్బందులు తొలిగిపోతాయని ఎంపిటిసి ప్రతినిధి నర్తు ప్రేమ్‌కుమార్ యాదవ్ అన్నారు. మండలంలోని ఈదుపురంలో రూ.6 లక్షలలు నిధులతో నిర్మించిన విశాఖ డెయిరీ పాల సేకరణ కేంద్రాన్ని మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో పాడి రైతులు పాలను దగ్గరలో ఉన్న పట్టణానికి వెళ్లి విక్రయించేవారని అన్నారు. విశాఖ డెయిరీ రాకతో పాడి రైతులు ఆర్థికంగా నిలదొక్కుకున్నారని అన్నారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ సూపర్‌వైజర్ ప్రసాద్, పాడి రైతులు నర్తు భానోజీరావు, నర్తు మామయ్య, జుత్తు యర్రయ్య, దాసరి నూకయ్య, దట్టి ఢిల్లీరావు, దట్టి ఉమాపతి, కలక్షన్ ఏజెంట్లు వైకుంఠం, పురుషోత్తం, గోపి పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎంపిటిసి ప్రేమ్‌కుమార్ యాదవ్

కొండచిలువ హల్‌చల్

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని గాజులకొల్లివలస పంచాయతీ పరిధిలోని శ్రీహరిపురం వద్ద సోమవారం రాత్రి కొండచిలువ హల్‌చల్ చేసింది. అలికాం-బత్తిలి ప్రధాన రహదారిపై రోడ్డుకు అడ్డంగా భారీ శబ్ధంతో పాము తిష్ట వేసింది. దీంతో ప్రధాన రహదారిపై రాకపోకలు సాగించే ప్రయాణికులు, వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. కొద్దిసేపు ప్రధాన రహదారిపై ఇరువైపులా ఎక్కడి వారు అక్కడే నిలబడి పోయారు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన కొంతమంది యువకులు అక్కడకు చేరుకొని రోడ్డుకు అడ్డంగా ఉన్న కొండ చిలువను కర్రలతో ఉసుగులుపుతూ పక్కనే ఉన్న వంశధార కుడి ప్రధాన కాలువలోకి మళ్లించారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకొన్నారు. అనంతరం వాహనదారులు రాకపోకలు సాగించారు.



రోడ్డుపై ఉన్న కొండచిలువ



లావేరు : అవార్డు అందుకుంటున్న గోవిందరావు



పలాస : ప్రశంసాపత్రం అందుకుంటున్న శ్రీనివాసరావు

గ్రీన్ స్కూల్స్‌కు పాఠశాలల ఎంపిక

పలాస : దేశ రాజధాని న్యూఢిల్లీని స్టేయిన్ ఆడిటోరియంలోని ఇండియా హాబిటేట్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన కార్నివాల్ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం మండలంలోని బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని జాతీయ హరితదళ క్లబ్ ఆధ్వర్యాన పర్యావరణ హిత కార్యక్రమానికి గ్రీన్ స్కూల్స్ పురస్కారానికి ఎంపికైంది. సిఎస్ఇ డైరెక్టర్ జనరల్ సునీతా నారాయణ్ నుంచి పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు, ఎన్‌జిసి క్లస్టర్ కో-ఆర్డినేటర్ కొయ్యల శ్రీనివాసరావు అందుకున్నారు. డిఇఒ డాక్టర్ తిరుమలచైతన్య, ప్రధానోపాధ్యాయులు ఎస్.వి.రమణారావు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఆర్.బాలాశంకరం, ఉపాధ్యాయులు అభినందించారు.

లావేరు : సిఎస్ఇ న్యూఢిల్లీ నిర్వహించిన గ్రీన్ స్కూల్ ప్రోగ్రామ్‌కు లావేరు మండలంలోని బుడుమూరు జెడ్‌పి పాఠశాల ఎంపికైందని ఆంగ్ల ఉపాధ్యాయులు, ఎపిఎన్‌జిసి జిల్లా కో-ఆర్డినేటర్ పూజారి గోవిందరావు తెలిపారు. ఢిల్లీలో సిఎస్ఇ డైరెక్టర్ సునీత నరయన్ అవార్డులను అందజేశారన్నారు.



మాట్లాడుతున్న బాబూరావు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో 'వజ్జ' ప్రచారం

ప్రజాశక్తి- పలాస

తూర్పుగోదావరి జిల్లా తునిలో నిర్వంహించనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి తరుపున పోటీ చేస్తున్న పేరా భక్తుల రాజశేఖర్‌కు మద్దతుగా ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఆ నియోజకవర్గానికి ఆయన్ని టిడిపి నుంచి ఎన్నికల పరిశీలకులగా చంద్రబాబు నాయుడు నియమించడంతో ఆ ప్రాంత కూటమి నాయకులు, పట్టభద్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 6500 ఓట్లు ఉండడంతో ప్రతి 30 మందికి ఒక ఇన్‌ఛార్జి ఏర్పాటు చేసి 216 మందిని నియమించాలని సూచించారు. ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేస్తే గెలిచే అవకాశం ఉంటుందన్నారు. ఆ దిశగా పనిచేయాలని సూచించారు.

ఐక్యంగా నడవాలి

ప్రజాశక్తి- బూర్జ

తూర్పు కాపుల ఆశయ సాధనకు అందరూ ఏకతాటిపై నడవాలని తూర్పుకాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ మక్కా సాయిబాబు నాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని రాజపేటలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాయిబాబును విశ్వప్రసాద్ దుశ్శాలువ కప్పి సన్మానించారు. అనంతరం మండలంలోని పెద్దపేటలో ఉన్న గెడ్డంగుల సంస్థ డైరెక్టర్ ఎ.రామకృష్ణంనాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు.



సన్మానిస్తున్న విశ్వప్రసాద్

విద్యా సంస్కరణల పేరుతో పోస్టుల రద్దు

ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు రమణమూర్తి

ప్రజాశక్తి- ఆమదాలవలస

పాఠశాల విద్యా శాఖలో సంస్కరణలన్నీ ఉపాధ్యాయ పోస్టుల రద్దు చుట్టూనే తిరుగుతుయని ఎస్‌టి యు జిల్లా అధ్యక్షులు ఎస్.వి.రమణమూర్తి అన్నారు. పట్టణంలోని విద్యాశాఖ కార్యాలయంలో స్వాతంత్ర్య సమర యోధుడు ఉర్దూ కవి, కార్మిక నాయకుడు, మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ కీ.శే. మఖ్దూం మొహియుద్దీన్ మంగళవారం నిర్వహించిన జయంతి వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయ సమస్యలపై నిబద్ధతతో రాజీలేని పోరాటం చేసిన మొహియుద్ధిన్ స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ మాట్లాడుతూ పాఠశాల విద్యా శాఖలో కొన్నేళ్లుగా సంస్కరణలు పరంపర కొనసాగుతున్నాయని అన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రామకృష్ణ, బి.రమేష్, బి.శ్రీనివాసరావు, జి.నరేష్, ఎస్.శ్రీనివాసరావు, బి.మన్మథరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమణమూర్తి

రహదారుల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు


కూటమి ప్రభుత్వంతో గ్రామాల్లో అభివృద్ధి చెందుతున్నాయని జనసేన మండల నాయకులు చింత మోహనరావు, తమాడ లక్ష్మణరావు అన్నారు. మండలంలోని కొమరల్తాడ రైతు సేవా కేంద్రం నుంచి దేవునల్తాడ వరకు కొత్తగా నిర్మిస్తున్న తారు రోడ్డు పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి హామీ నిధులు రూ.1.10 కోట్లతో 1.60 కిలో మీటర్లు తారు రోడ్డు పనులు చేపడుతున్నామని అన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బొడ్డు మధు, గణపతిరావు, టెంక తేజేశ్వరరావు తామాడ కోదండరావు, లిమ్మాడ నాగరాజు, దండుపాటి విగ్నేష్, పవన్ కుమార్, బొడ్డు రవణ పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న జనసేన నాయకులు

వెండి చేతులు బహూకరణ

కవిటి: కవిటికి చెందిన శివ చింతామణి పాన్‌షాప్ వర్తక సంఘం తమ ఉదారత చాటుకుంది. మండల కేంద్రంలోని బెహరా వీధిలో ఉన్న జగన్నాథ స్వామికి రూ.1,30 లక్షల విలువ చేసే వెండి చేతులను మంగళవారం బహుకరించింది. కార్యక్రమంలో కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు, వర్తక సంఘం సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వెండి చేతులు



కూలీలతో మాట్లాడుతున్న ఎంపిడిఒ తిరుమలరావు

'ఉపాధి' పనులు పరిశీలన

కంచిలి: మండలంలోని బూరగాం పంచాయతీ ఎరుకల బంధ చెరువులో చేపడుతున్న ఉపాధి పనులను ఎంపిడిఒ వి.తిరుమలరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి కూలీలతో మాట్లాడుతూ కొలతల ప్రకారం పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్ పాల్గొన్నారు. అలాగే జాడుపూడి కెజిబివిని సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తరగతి గదులను, మరుగొడ్లను పరిశీలించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినులు పబ్లిక్ పరీక్షలకు సిద్ధం కావాలని పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.